
సంపుటి : 04 | సంచిక : 298
పేజీలు : 08 | వెల: రూ.5/-
సోమవారం
సెప్టెంబర్ 08, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net

# వరంగల్ వాయిస్

*Evening Daily*




## టీపీసీసీ అధ్యక్షుడికి సన్మానం

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులై ఒక సంవత్సరం పూర్తి చేసుకొన్న బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ ను సోమవారం హైదరాబాద్ లోని గాంధీభవన్ లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువా కప్పి పూల మాలతో సత్కరించారు. **–వరంగల్ వాయిస్, హనుమకొండ**




7లో..

# ఐక్యంగా కదులుదాం.. రాజకీయంగా ఎదుగుదాం..

## ఘనంగా పద్మశాలి పరపతి సంఘాల సమావేశం

హాజరైన సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారులు

పండుగలు, సంస్కృతి వికాసం, కార్తీకమాస వనభోజనాలపై చర్చ

# కేసీఆర్ చాణక్య వ్యూహం



- కవిత ఎపిసోడ్ ఆయన స్క్రిప్టే
- హరీష్ ను బయటకు పంపేందుకు కుట్ర
- తద్వారా బీజేపీలో బీఆర్ఎస్ విలీనానికి మార్గం సుగమం
- కేటీఆర్ ను ద్వితీయశ్రేణి నాయకుడిగా మార్చేందుకు బీజేపీ పన్నాగం
- కొత్త పార్టీ పేరిట కల్వకుంట్ల కుటుంబం ప్రజల్లో ఉండేలా ఎత్తుగడ

వివరాలు2లో..



రాష్ట్రంలో కల్వకుంట్ల కవిత ఎపిసోడ్ కొనసాగుతోంది. పార్టీ నుంచి బహిష్కరించిన తర్వాత ఆమె పయనం ఎటూ అన్న చర్చ సాగుతోంది. అమె కొత్తపార్టీ పెడతారనే వాదనే బలంగా వినిపిస్తోంది. అయితే కవిత ఎపిసోడ్ కు కర్త, కర్మ, క్రియ అంతా కేసీఆరే అన్న ప్రచారం సాగుతోంది. కేసీఆర్ కు తన పిల్లలపై వల్లమాలిన ప్రేమ. కవిత అంటే ఆయనకు ఇంకాస్త అభిమానం. వారు ఎంత చెబితే అంత అన్నట్లుగానే ఇంతకాలం పార్టీలో కొనసాగింది. అలాంటిది కవితపై ఎలాంటి విచారణ చేపట్టకుండా, కనీసం ఆమెను పిలిచి మాట్లాడకుండానే పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతోందంటూ ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం వెనుక కేసీఆర్ భారీ కుట్ర దాగి ఉందంటున్నారు. తనపైన, పార్టీపైన నమోదవుతున్న కేసుల నుంచి గట్టెక్కాలంటూ బీజేపీతో చేతులు కలపడం తప్ప కేసీఆర్ కు ప్రత్యామ్నాయం కనిపించడంలేదు. బలవంతంగానో.. ఇష్టపూర్వకంగానో పార్టీని బీజేపీలో విలీనం చేయాల్సి వస్తే.. తమ కుటుంబం నుంచి ఓ పార్టీ ప్రజల్లో ఉండాలన్న టార్గెట్ తో.. కేసీఆర్ కవితతో వ్యూహాత్మక అడుగులు వేయిస్తున్నారంటున్నారు. విలీనానికి ముందే ఆమెను పార్టీ నుంచి బహిష్కరించి పార్టీతో ఆమెకు ఎలాంటి సంబంధం లేదన్న సంకేతాలను ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. బీజేపీలో విలీనం వ్యతిరేకంగా కవిత మొదట రెబల్‌గా మారిన సంగతిని ఇక్కడ గుర్తు చేసుకోవచ్చు. **–వరంగల్ వాయిస్ ప్రతినిధి**



8లో..

## ప్రజల కోసమే జీవితం..

- త్యాగం చేసేది కమ్యూనిస్టులే
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- హనుమకొండలో ఘనంగా సురవరం సంస్మరణ సభ



2లో..

## ముసాయిదా ఓటర్ల జాబితా సిద్ధం

- రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం



8లో..

## వినతులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- గ్రీవెన్స్ లో 136 ఫిర్యాదుల స్వీకరణ

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
సోమవారం, సెప్టెంబర్ 08, 2025

# కేసీఆర్ చాణక్య వ్యూహం

- కవిత ఎపిసోడ్ ఆయన స్క్రిప్టే
- హరీష్ ను బయటకు పంపేందుకు కుట్ర
- తద్వారా బీజేపీలో బీఆర్ఎస్ విలీనానికి మార్గం సుగమం
- కేటీఆర్ ను ద్వితీయశ్రేణి నాయకుడిగా మార్చేందుకు బీజేపీ పన్నాగం
- కొత్త పార్టీ పేరిట కల్వకుంట్ల కుటుంబం ప్రజల్లో ఉండేలా ఎత్తుగడ



**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** రాజకీయాల్లో ఒక్కోసారి ప్రత్యర్థులపై వ్యూహాలు రచించాలి.. అదే సమయంలో సొంత పార్టీపైనా తప్పదు. బీఆర్ఎస్ లో ఇప్పుడు అలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. అందుకే కవిత ఎపిసోడ్ మొత్తం కేసీఆర్ స్క్రిప్టేనని ఎక్కువ మంది రాజకీయ నేతలు నమ్ముతున్నారు. కేసీఆర్.. తన పిల్లల కంటే ఎప్పుడూ ఎవరికీ ప్రాధాన్యం ఇవ్వరని.. వారు చెప్పింది ఖచ్చితంగా వింటారని చాలా మందికి తెలుసు. కవిత అంటే కేసీఆర్‌కు ఇంకాస్త ఎక్కువ అభిమానం. ఇంకా చెప్పాలంటే ఆడపిల్లపై ఏ తండ్రికైనా ఎక్కువ అభిమానం ఉంటుంది. అందుకే.. ఈ ఎపిసోడ్ కల్వకుంట్ల కుటుంబంలో చీలిక కాదని.. కేసీఆర్ స్క్రిప్టేనని ప్రచారం జరుగుతోంది. కేసీఆర్ పార్టీ పెట్టినపుడు కూడా అప్పట్లో కేసీఆర్‌తో చంద్రబాబు నడిపిస్తున్నారని చర్చించుకున్నారు. కానీ రాను రాను ఆ ప్రచారం తేలిపోయింది. ఇది కూడా అలా అవుతుందా లేకపోతే టార్గెట్ ను రీచ్ చేస్తారా అన్నది జరగబోయే రాజకీయ పరిణామాలను బట్టి క్లారిటీ వస్తుంది.

### అనేక కారణాలు..

భారత రాష్ట్ర సమితి రాజకీయ పరిణామాల్లో ఇప్పుడు అందరికీ ఒకటే సందేహం వినిపిస్తోంది. ఇప్పుడు జరుగుతున్నంతా కేసీఆర్ స్క్రిప్ట్ కావొచ్చన్నదే ఆ సందేహం. కవితతో కావాలనే కేసీఆర్ నాటకం ఆడిస్తున్నారని.. దానికి చాలా కారణాలు ఉన్నాయని అంటున్నారు. హరీష్ రావు ఇమేజ్‌ను దెబ్బతీసి పార్టీ నుంచి బయటకు పంపడం దగ్గర నుంచి బీజేపీలో పార్టీ విలీనం వరకూ చాలా వ్యూహాలకు కేసీఆర్ పదునుపెడుతున్నట్లు సమాచారం. అందుకే కవితను బయటకు పంపించి కొత్త రాజకీయం చేస్తున్నారని అనుమానిస్తున్నారు.

### హరీష్ ను పంపేందుకేనా..

బీఆర్ఎస్ పార్టీలో హరీష్ రావు కీలక నేత. ఎంతగా అంటే.. పార్టీ పెట్టినప్పటి నుంచి ఆయనే లీడర్లు, క్యాడర్ ను సమన్వయం చేశారు. ప్రతి జిల్లాలో నేతలంతా ఆయనకు పరిచయం ఉన్నవారే. రేపు తేడా వస్తే.. పార్టీ క్యాడర్ సగం హరీష్ వెంట వెళ్తుంది. అయితే హరీష్ ను కేవలం మెదక్ జిల్లాకు పరిమితం చేసి చాలా కాలం అవుతోంది. అదే విధంగా కేటీఆర్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షలుగా బాధ్యతలు చేపట్టీ చాలా కాలం అయింది. అయినప్పటికీ పార్టీ పరిస్థితిలో మార్పు లేదు. కేటీఆర్ అనుకున్నంతగా పార్టీపై పట్టు సాధించలేదు సరి కదా.. అహంకార ధోరణితో సొంత పార్టీలోనే కొంత మందికి వ్యతిరేకమయ్యారు. వారు సమయం వచ్చినప్పుడు బయట పడతారన్న అభిప్రాయం చాలా కాలం నుంచి వినిపిస్తోంది. అందుకే ఇప్పుడు హరీష్ ఇమేజ్ ను ప్రజల్లో వీలైనంతగా చులకన చేయాలన్న లక్ష్యంతోనే.. ఎవరు చెబితే ఎక్కువగా ప్రజల్లోకి వెళ్తుందో.. వారితో చెప్పించేందుకు కవితను రంగంలోకి దించినట్లుగా అనుమానిస్తున్నారు. కవిత ఆరోపణల తర్వాత ఇప్పుడు హరీష్ రావుపై సోషల్ మీడియాలో చర్చలు విపరీతంగా జరుగుతున్నాయి. 30 ఏళ్ళ కిందట ఆయన ట్రంకు పెట్టె, రబ్బరు చెప్పులతో కేసీఆర్ వద్దకు వచ్చారని.. ఇప్పుడు ఆయన ఆర్థిక స్థాయి ఎంత.. ఎలా సంపాదించారన్న ప్రశ్నలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఇవి రాను రాను పెరగనున్నాయి. కవిత టార్గెట్ హరీష్ గానే ఫిక్సయ్యారు.

### విలీనం చేయాల్సి వస్తే..

పార్టీనీ, కేసీఆర్ ను చుట్టుముడుతున్న సమస్యలతో పార్టీని కాపాడుకోవడం కష్టమన్న నిర్ణయానికి కేసీఆర్ వచ్చినట్లు ప్రచారం సాగుతోంది. అదే సమయంలో కవితతో కేసీఆరే రాజకీయం చేయిస్తున్నారన్నదానికి మరో ప్రధాన కారణం బీజేపీలో విలీనం. బీజేపీ తమ పార్టీని బలవంతంగానో.. ఇష్టపూర్వకంగానో విలీనం చేయించుకుంటే ఆ తర్వాత బీఆర్ఎస్ కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. కేసీఆర్ రిటైర్మెంట్ తీసుకోవాలి.. కేటీఆర్ ను మాత్రమే యాక్టివ్ గా ఉండమని బీజేపీ చెప్పే అవకాశం ఉంది. బీజేపీ రాజకీయాలను చూస్తే.. కేటీఆర్ నూ ద్వితీయశ్రేణి నాయకుడిగా మార్చేస్తారు. అందుకే పార్టీని విలీనం చేయాల్సి వస్తే. .. తమ కుటుంబం నుంచి ఓ పార్టీ ప్రజల్లో ఉండాలన్న టార్గెట్ తో.. కేసీఆర్ కవితతో వ్యూహాత్మక అడుగులు వేయిస్తున్నారంటున్నారు. బీజేపీలో విలీనం తర్వాత ఏదో విధంగా కల్వకుంట్ల కుటుంబానికి చెందిన ఒక పార్టీ ప్రజల్లో బలంగా ఉండేలా కేసీఆర్ చాణక్యనీతిని ప్రదర్శిస్తున్నట్లు పలువురు చెప్పుకొంటున్నారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ కనుమరుగైనా కవిత రూపంలో మరో పార్టీ ప్రజలకు అందుబాటులో ఉండేలా వ్యూహాత్మకంగా కేసీఆర్ అడుగులు వేస్తున్నారని చెప్పుకొంటున్నారు.



# ముసాయిదా ఓటర్ల జాబితా సిద్ధం

□ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం జిల్లాలో ముసాయిదా ఓటర్లు, పోలింగ్ కేంద్రాల జాబితాపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలోని 12మండలాల్లో గ్రామపంచాయతీల వారీగా ముసాయిదా ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాను ఇప్పటికే ప్రచురించడం జరిగిందన్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే తెలియజేయాలన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాపై అభ్యంతరాలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశానికి హాజరైన రాజకీయ పార్టీల ప్రతినిధులు మండలాల్లో ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే వాటి సమాచారాన్ని అందజేయాలన్నారు. హనుమకొండ జిల్లాలో రెండు రెవెన్యూ డివిజన్లు ఉన్నాయని, 12 మండల ప్రజా పరిషత్ లు, 12 జిల్లా ప్రజా పరిషత్ లున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో 3,70,871 మంది ఓటర్లు ఉండగా , ఇందులో మహిళా ఓటర్లు 1,90,201, పురుష ఓటర్లు 1,80,666, ఇతరులు– నలుగురున్నారని తెలియజేశారు. హనుమకొండ జిల్లాలో 631 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా పరిషత్ ఇన్చార్జి సీఈవో రవి సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈవీ. శ్రీనివాసరావు, శ్యాంసుందర్, ప్రభాకర్ రెడ్డి, సయ్యద్ ఫైజుల్లా, నిశాంత్, రజనీకాంత్, ఎండి.నేహాల్, డాక్టర్ ఇండ్ల నాగేశ్వరరావు, ప్రవీణ్ కుమార్, జయంత్ లాల్ పాల్గొన్నారు.

# ఫ్లాష్.. ఫ్లాష్..

## నా భార్య చంపాలని చూస్తోంది..

మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకున్న తన భార్య తనను హతమార్చాలని చూస్తోందని, తనకు ప్రాణహాని ఉందంటూ ఒక వ్యక్తి ఆందోళన వ్యక్తం చేశారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం సోమారం గ్రామ శివారు జగ్గు తండాకు చెందిన బానోతు మహేశ్ ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల వినాయక చవితి అన్నదానం సందర్భంగా తనపై దాడి చేయించిందని వాపోయాడు. పోలీసులు తనకు న్యాయం చేయాలని కోరాడు.

### వరంగల్ లో కిడ్నాప్..

వరంగల్ పోచమ్మ మైదాన్ కూడలిలోని జకోటియా కాంప్లెక్స్ సమీపంలో అబిత్ కుమార్ అనే యువకుడిని గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసినట్లు సమాచారం. అపహరించిన అబిత్ కుమార్ తండ్రికి ఫోన్ చేసి రూ.10 లక్షలు డిమాండ్ చేసినట్లు ప్రచారం సాగుతోంది. దీంతో అబిత్ కుమార్ తండ్రి అశోక్ మట్టెవాడ పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కిడ్నాపర్ల కోసం సీసీ టీవీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

### పరపతి సంఘం ఎదుట ఆందోళన..

వరంగల్ రైల్వే గేట్ ప్రాంతంలోని ఓ పరపతి సంఘం వద్ద సభ్యులు సోమవారం ఆందోళనకు దిగారు. సంఘంలో ఉన్న కమిటీ సభ్యుల డబ్బులు వాడుకున్నారని, పలుమార్లు కమిటీని సభ్యులు అడిగినా కూడా డబ్బులు ఇవ్వకుండా తిప్పించుకుంటున్నారని ఆందోళన కారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిటీ డబ్బులు చెల్లించకుంటే వారి ఇంటికి వెళ్లి ధర్నా చేయడానికి సిద్ధం అంటూ సభ్యులు హెచ్చరించారు.

**–వరంగల్ వాయిస్, కాశీబుగ్గ**

# మేడారం, బాసర అభివృద్ధిపై సీఎం సమీక్ష



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మేడారం, బాసర ఆలయాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ఇతర మంత్రులు, అధికారులతో సమీక్షించారు. వచ్చే సంవత్సరం జనవరిలో నిర్వహించనున్న మేడారం మహాజాతర నాటికి భక్తులకు సౌకర్యంగా ఉండేలా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. 100 రోజుల్లో మేడారం అభివృద్ధి పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. మేడారం అభివృద్ధికి సంబంధించి పలు డిజైన్లను పరిశీలించి పూర్తిగా సహజసిద్ధమైన రాతి కట్టడాలతో నిర్మాణాలు ఉండేలా చర్యలు చెపట్టాలని సూచించారు. భక్తులకు సౌకర్యంగా ఉండేలా ఎంట్రీ, ఎగ్జిట్, పార్కింగ్ వసతులు ఉండాలనీ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని జంపన్న వాగులో నీరు నిలిచేలా ఏరియాల వారీగా చెక్ డ్యామ్ ల నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ వారంలో మేడారంకు వచ్చి క్షేత్రస్థాయి పరిశీలన చేస్తానంటూ సీఎం పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు సూచించారు. అదే విధంగా బాసర జ్ఞాన సరస్వతీ దేవాలయ విస్తరణ, అభివృద్ధికి సంబంధించిన పలు సూచనలు చేసారు. అన్ని దేవాలయాల అభివృద్ధికి సంబంధించి స్థానిక సెంటిమెంట్ ను గౌరవించడంతోపాటు, స్థానిక నిపుణులు, పూజారుల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ లో 7వ ఆల్ ఇండియా ప్రిజన్ డ్యూటీ మీట్

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ జైళ్లు, కరెక్షనల్ సర్వీసెస్ విభాగం ప్రతిష్ఠాత్మకమైన 7వ ఆల్ ఇండియా ప్రిజన్ డ్యూటీ మీట్–2025ను హైదరాబాద్‌లోని ఆర్ బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో నిర్వహించనుంది. సెప్టెంబర్ 9 నుంచి 11 వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 21 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 1,300 మందికి పైగా జైలు సిబ్బంది, వారిలో 184 మంది మహిళా సిబ్బంది కూడా ఉంటారు, 36 రకాల ఈవెంట్లలో తమ నైపుణ్యాలను ప్రదర్శించనున్నారు. తెలంగాణ ఈ ప్రతిష్ఠాత్మక పోటీని రెండోసారి నిర్వహిస్తుండటం విశేషం. గతంలో 2015లో మొదటిసారిగా ఈ పోటీలను నిర్వహించింది. 2022లో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన 6వ ఆల్ ఇండియా ప్రిజన్ డ్యూటీ మీట్‌లో తెలంగాణ ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకుని రాష్ట్రానికి గొప్ప కీర్తిని తెచ్చిపెట్టింది. ఈ కార్యక్రమం కోసం తెలంగాణ జైళ్ల శాఖ గత మూడు నెలలుగా బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ & డెవలప్‌మెంట్ (బీపీఆర్అండ్ డీ), న్యూఢిల్లీ, భారత ప్రభుత్వ హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖతో సమన్వయం చేసుకుంటూ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పోటీలలో ఫస్ట్ ఎయిడ్, జైలు సంక్షేమ పథకాలు, బిజినెస్ మోడల్స్, క్విజ్, వైద్య నైపుణ్యాలు, కంప్యూటర్ పరిజ్ఞానం వంటి వృత్తిపరమైన ఈవెంట్లు, అలాగే షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, బాస్కెట్‌బాల్, కరాటే, అథ్లెటిక్స్, డ్యాన్స్, మ్యూజిక్, పెయింటింగ్ వంటి క్రీడలు, లలిత కళలు ఉంటాయి. ఈ మీట్ ప్రారంభానికి ముందు, తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ డాక్టర్





సౌమ్య మిశ్రా, ఐపీఎస్, ఇతర సీనియర్ అధికారులు తుది సన్నాహాలను సమీక్షించారు. ఈ సందర్భంగా తెలంగాణ నుంచి పాల్గొనే సిబ్బందికి స్పోర్ట్స్ కిట్లు, ఇతర ఉపకరణాలను అందజేసి, జాతీయ స్థాయిలో క్రమశిక్షణతో, ఆత్మవిశ్వాసంతో రాణించాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో జైళ్ల ఐజీలు వై. రాజేష్, ఎన్. మురళీ బాబు, హైదరాబాద్ రేంజ్ డీఐజీ డాక్టర్ డి. శ్రీనివాస్, వరంగల్ రేంజ్ డీఐజీ ఎం.సంపత్ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ ఏడాది మీట్‌లో కొత్తగా ఆల్ ఇండియా టెక్నో ఎక్స్‌పో,యు నేషనల్ ప్రిజన్ ప్రొడక్ట్ స్టాల్స్ నిర్వహిస్తున్నారు. ఈ ఎక్స్‌పోలో జైలు భద్రతకు సంబంధించిన సాంకేతిక పరికరాలు, సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రదర్శించబడతాయి. అలాగే, 13 రాష్ట్రాల నుంచి జైళ్లలో తయారైన ఉత్పత్తులు కూడా అమ్మకానికి ఉంటాయి. మూడు రోజుల ఈ ఈవెంట్‌లో ప్రారంభ, ముగింపు వేడుకలు, పోటీలు, మెడల్స్ ప్రెజెంటేషన్,యు తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే సాంస్కృతిక సాయంకాల కార్యక్రమాలు ఉంటాయి. చివరి రోజు రాష్ట్ర ఆతిథ్యాన్ని చాటిచెప్పే విధంగా సంప్రదాయ బడా ఖానా (గ్రాండ్ డిన్నర్) నిర్వహిస్తారు. చేనేత అండ్ జౌళి శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 8 నుంచి 11 వరకు హస్తకళలు, చేనేత స్టాల్స్ గణనీయమైన తగ్గింపులతో అందుబాటులో ఉంటాయి. పర్యాటక శాఖ స్టాల్ కూడా ఏర్పాటు చేసి, పాల్గొనేవారికి రాయితీ ధరలకు ఒక రోజు, సగం రోజుల టూర్ ప్యాకేజీలను అందిస్తుంది. హైదరాబాద్ ప్రసిద్ధ ముత్యాలు కూడా అమ్మకానికి ఉంటాయి.

# కమలాపూర్‌లో ఘనంగా గురుపూజోత్సవం

◆ 15 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

**వరంగల్ వాయిస్, కమలాపూర్:** మండలంలోని మండల విద్యాధికారి కార్యాలయంలో గురుపూజోత్సవం, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఎంఈఓ శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకకు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్, ఎంపీడీఓ గుండె బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 15 మంది ఉపాధ్యాయులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఝాన్సీరాణి మాట్లాడుతూ రాజకీయ నాయకులకు, వ్యాపారస్తులకు స్వార్థం ఉంటుందని, కానీ ఉపాధ్యాయులకు ఒకే ఒక స్వార్థం ఉంటుందని అన్నారు. అది తమ విద్యార్థి ప్రతిభావంతుడై ఉన్నత శిఖరాలకు ఎదిగినప్పుడు చూసి సంతోషించడం అని పేర్కొన్నారు. ఈ దేశానికి రైతు, సైనికుడు ఎంత ముఖ్యమో ఉపాధ్యాయుడు కూడా అంతే



ముఖ్యమని తెలిపారు. ఒక సైనికున్ని తయారు చేసేది ఉపాధ్యాయుడేనని, నేటి ఆధునిక సాంకేతిక వ్యవసాయ విధానానికి కూడా ఉపాధ్యాయుడు అవసరమని ఆమె అన్నారు. "జై జవాన్, జై కిసాన్" అనే నినాదంతో పాటు "జై ఉపాధ్యాయ" అనే నినాదం కూడా ఉండాలని ఆమె ఉపాధ్యాయులను కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

◆ హాజరైన కుడా మాజీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్

**వరంగల్ వాయిస్, భీమారం:** హనుమకొండ జిల్లా భీమారంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో ఆర్గనైజేషన్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ (ఓబీసీ) ఆధ్వర్యంలో ఆదివారం ఒక ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది. కుడా మాజీ చైర్మన్, ఓబీసీ అధ్యక్షులు సుందర్ రాజ్ యాదవ్ ఈ శిబిరాన్ని ఉపాధ్యక్షులు డాక్టర్ లక్ష్మి ప్రసాద్, డాక్టర్ టి. విజయలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ జక్కుల రజిత–వెంకన్నలతో కలిసి ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో బీసీ వసతి గృహంలో నివసిస్తున్న 130 మంది విద్యార్థినులకు గైనిక్, థైరాయిడ్, దంత, మరియు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుందర్ రాజ్ యాదవ్ మాట్లాడుతూ పేద బీసీ కుటుంబాలకు చెందిన విద్యార్థినులకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. కార్పొరేట్ స్థాయి వైద్యులతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు దాటినా ఇంకా బీసీలు వెనుకబడి ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ పిల్లల విద్య, ఉపాధి కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని, ప్రతిభ కలిగిన విద్యార్థినులకు ప్రోత్సాహం అందిస్తామని హామీ ఇచ్చారు. వసతి గృహంలో చదువుకుంటున్న బాలికలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని సుందర్ రాజ్ యాదవ్ హామీ ఇచ్చారు. భవిష్యత్తులో



జిల్లాలోని మరిన్ని బీసీ వసతి గృహాలలో ఇలాంటి మెగా హెల్త్ క్యాంపులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని విద్యార్థులకు సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ శిబిరంలో ఓబీసీ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ డాక్టర్ గద్దం భాస్కర్, వైస్ ప్రెసిడెంట్లు డాక్టర్ లక్ష్మి ప్రసాద్, డాక్టర్ టి. విజయలక్ష్మి, జాయింట్ సెక్రెటరీలు ఎం.ఎన్. మూర్తి, కె. నాగరాజు, హాస్టల్ వార్డెన్ ప్రియాంక పాల్గొన్నారు. డాక్టర్ మేఘన (జనరల్ ఫిజీషియన్), డాక్టర్ ఆశాదేవి (ఆప్తమాలజిస్ట్), డాక్టర్ మోహన్ కృష్ణ (జనరల్ ఫిజీషియన్), డాక్టర్ శృతిక (డెంటల్ ఫిజీషియన్), డాక్టర్ లక్ష్మి ప్రసాద్ (న్యూరో సర్జన్), డాక్టర్ విజయ లక్ష్మి (జనరల్ ఫిజీషియన్), డాక్టర్ హరీష్ యాదవ్ (ఫిజియోథెరపీ & సైకాలజిస్ట్), డాక్టర్ శంతన్ గుజ్జుల (ఆర్థోపెడిషియన్), డాక్టర్ సౌమ్య గుజ్జుల (గైనకాలజిస్ట్)తో కూడిన వైద్య బృందం విద్యార్థులకు వైద్య సేవలు అందించింది.

# డాక్టర్ పాలకుర్తి దినకర్‌కు 'జాతి నిర్మాణ పురస్కారం'



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ కళాశాలకు చెందిన డాక్టర్ పాలకుర్తి దినకర్, భవిష్యత్ తరాలను తీర్చిదిద్దడంలో ఆయన అసాధారణమైన అంకితభావానికి, విద్యా రంగానికి చేసిన విశేష కృషికి గాను ప్రతిష్ఠాత్మకమైన 'జాతి నిర్మాణ పురస్కారం' (నేషనల్ బిల్డర్ అవార్డు) అందుకున్నారు. ఈ పురస్కారాన్ని రోటరీ డిస్ట్రిక్ట్ 3150, రోటరీ క్లబ్ ఆఫ్ హనుమకొండ సంయుక్తంగా ప్రదానం చేశాయి. ఈ సందర్భంగా, డాక్టర్ దినకర్ నిబద్ధత, నాయకత్వ లక్షణాలు ఆయన వృత్తిలో అత్యున్నత ప్రమాణాలను నెలకొల్పాయని రోటరీ క్లబ్ ప్రశంసించింది. ఈ పురస్కారం నిజంగా ఆయనకు 'జాతి నిర్మాత' అనే ఘనతను తెచ్చిపెట్టిందని క్లబ్ పేర్కొంది. ఈ అవార్డు ప్రదాన కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ హనుమకొండ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి బేతి, జిల్లా గవర్నర్ రిటైర్డ్ ఎస్.వి. రామ్ ప్రసాద్, కార్యదర్శి రిటైర్డ్ నరేష్ గంగోజుల పాల్గొన్నారు. ఈ అవార్డు డాక్టర్ దినకర్ విద్యా సేవలకు గుర్తింపుగా నిలిచిందని వారు సంతోషం వ్యక్తం చేశారు.

# ఆడెపు రవీందర్‌కు 'నవరస కళా పురస్కార్'



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని కాళోజీ కళాక్షేత్రంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ శాంతి కృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో 'కాకతీయ కళా వైభవం నవరస కళా పురస్కార మహోత్సవాలు' ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బాలాజీ క్రియేషన్స్ అధినేత, లయన్ డాక్టర్ ఆడెపు రవీందర్ 'నవరస కళా పురస్కార్' అవార్డును అందుకున్నారు. ఈ అవార్డును శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ చేతుల మీదుగా డా.రవీందర్ స్వీకరించారు. ఈ పురస్కారం తనకు లభించడం పట్ల డా. రవీందర్ హర్షం వ్యక్తం చేశారు. గతంలో తాను చేపట్టిన వివిధ సేవా కార్యక్రమాలకు, అలాగే కళాకారులు, కళా సంస్థలకు అందించిన ప్రోత్సాహానికి గుర్తింపుగా ఈ అవార్డు లభించిందని ఆయన తెలిపారు. తనకు ఈ గౌరవం ఇచ్చినందుకు శ్రీ శాంతి కృష్ణ సేవా సమితికి మరియు డాక్టర్ శాంతి కృష్ణ గారికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంబార్ సుబ్బారావు, గంగు ఉపేంద్ర శర్మ, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కామాఖ్య దేవిని దర్శించుకున్న చల్లా

**వరంగల్ వాయిస్, పరకాల:** నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా అస్సాంలోని గౌహతిలో ఉన్న ప్రముఖ శక్తిపీఠం కామాఖ్య దేవి ఆలయాన్ని కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గ ప్రజలు



సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నీలాచల్ పర్వతంపై కొలువైన కామాఖ్య అమ్మవారి దర్శనం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి తెలిపారు. శక్తిపీఠాలలో ఒకటైన, స్త్రీ శక్తికి ప్రతీకగా నిలిచే కామాఖ్య అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికీ లభించాలని కోరుకున్నట్లు ఆయన చెప్పారు. ప్రతి సంవత్సరం తన పుట్టినరోజున వివిధ ఆలయాలను సందర్శించడం ఆనవాయితీగా వస్తున్న చల్లా ధర్మారెడ్డి, ఈసారి ఈశాన్య రాష్ట్రంలో ఉన్న ఈ మహిమాన్వితమైన క్షేత్రాన్ని ఎంచుకోవడం విశేషం. ఆయన వెంట కుటుంబ సభ్యులు కూడా ఉన్నారు.

# వార్డులో సమస్యలన్నీ పరిష్కరిస్తాం

## మాజీ కౌన్సిలర్ పొరండ్ల సంతోష్



**వరంగల్ వాయిస్, పరకాల:** పట్టణంలో స్థానిక శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాల మేరకు, కాంగ్రెస్ పార్టీ సమావేశం నిర్వహించారు. 03వ వార్డు ఇంచార్జి పొరండ్ల సంతోష్ ఆధ్వర్యంలో, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పొరండ్ల వేణు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రధానంగా చర్చించారు. సమావేశంలో మూడోవ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాలని తీర్మానించారు. అంతేకాకుండా, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపైనా చర్చ జరిగింది. తాగునీరు, విద్యుత్ కనెక్షన్లు లేక ఇబ్బందులు పడుతున్నామని లబ్ధిదారులు ఇన్చార్జి పొరండ్ల సంతోష్ దృష్టికి తీసుకొచ్చారు ఈ సమావేశంలో పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పొరండ్ల వేణు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ గడ్డం శివకుమార్, యూత్ కాంగ్రెస్ నాయకులు బాసాని సుమన్, ఓబీసీ చైర్మన్ ఆలేటి రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చల్లా జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, నడికూడ:** పరకాల నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి జన్మదిన వేడుకలు నడికూడ మండలంలో ఘనంగా జరిగాయి. మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి (చందు) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలో కేక్ కట్ చేసి, ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి నందికొండ గణపతి రెడ్డి, సమన్వయ కమిటీ సభ్యులు నందికొండ జైపాల్ రెడ్డి, మచ్చ రవీందర్, సుధాటి వెంకటేశ్వర్ రావు, నడికూడ మాజీ సర్పంచ్ ఊర రవీందర్ రావు, మండల అధికార ప్రతినిధి లింగాల తిరుపతి, రావుల కిషన్, యూత్ నాయకులు ముస్కే రాము, గుడికంధుల శివ, దురిశెట్టి వెంకటేష్, తిప్పర్తి ప్రశాంత్ రెడ్డి, బియ్యాలా ప్రశాంత్ రావు, కౌకొండ మాజీ ఎంపీటీసీ మేకల సతీష్, రాయపర్తి మాజీ సర్పంచ్ రావుల సరిత రాజిరెడ్డి, వివిధ గ్రామాల అధ్యక్షులు డైగ రాజు, తోగరు శ్రీనివాస్, ఇల్లందుల నాగరాజు, యూత్ నాయకులు నారగాని రాకేష్, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించండి



**వరంగల్ వాయిస్, ములుగు:** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత అధికారులు సమన్వయంతో వేగంగా పరిష్కరించాలని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, సంపత్ రావు లతో కలిసి ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సోమవారం మొత్తం 49 దరఖాస్తులు అందగా, అందులో అత్యధికంగా గృహ నిర్మాణ శాఖకు 13, భూ సమస్యలకు సంబంధించినవి 10, పెన్షన్లకు 9, ఉపాధి కల్పనకు 2, ఇతర శాఖలకు సంబంధించినవి 15 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తులను వెంటనే సంబంధిత అధికారులకు బదిలీ చేసి, వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, వివిధ జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి, పర్యవేక్షకులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు మరింత చొరవ చూపాలని కలెక్టర్ దివాకర టీఎస్ సూచించారు.

# వి.ప్రకాష్‌పై జాగృతి నేతల ఆగ్రహం

## ◆ భౌతిక దాడులు తప్పవని హెచ్చరిక



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కవితపై వ్యక్తిగత విమర్శలు చేసినందుకు తెలంగాణ జాగృతి నాయకులు వి. ప్రకాష్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై ఇలాంటి అవాకులు చెబితే భౌతిక దాడులు తప్పవని జాగృతి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ హెచ్చరించారు. జాగృతి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వి. ప్రకాష్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కేసీఆర్ అవినీతి మరకలు అంటించినవారు ఎవరని కవిత ప్రశ్నించిన అంశంపై మాట్లాడే దమ్ము వి. ప్రకాష్‌కు లేదని శ్రీకాంత్ గౌడ్ అన్నారు. ఆ అంశంపై మాట్లాడకుండా ఒక ఆడబిడ్డపై వ్యక్తిగత విమర్శలకు దిగడం నీచ సంస్కృతి అని ఆయన మండిపడ్డారు. “నువ్వు ఆరు నెలలు బయటకు పో అనడానికి నువ్వెవరివి? కవిత గారిని బొంద పెట్టే సత్తా నీకు ఉందా?” అంటూ తీవ్ర స్థాయిలో ప్రశ్నించారు. వి. ప్రకాష్ ‘గడ్డి తిని మొరుగుతున్నాడని’, అతను మేధావి కాదు, ‘మేత ఆవు’ అని శ్రీకాంత్ గౌడ్ విమర్శించారు. ఎంత ప్యాకేజీకి అమ్ముడు పోయావని ప్రశ్నిస్తూ, హరీష్ రావు ‘ఐ డ్రీమ్’ అనే సంస్థకు ప్యాకేజీ ఇచ్చి మాట్లాడిస్తున్నాడని ఆరోపించారు. కాళేశ్వరం అవినీతిలో వి. ప్రకాష్‌కు కూడా వాటా ఉందని, హరీష్ రావు, మెగా కృష్ణారెడ్డి పేర్లు బయటకు వస్తే నీ పేరు కూడా వస్తుందనే అక్కసుతోనే మాట్లాడుతున్నాడని ఆరోపించారు. వి. ప్రకాష్ వాటర్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా వాటా ఎంతని ప్రశ్నించారు. బీసీని అని చెప్పుకుంటూ మున్నూరు కాపు సంఘంలో చిచ్చుపెట్టింది నువ్వు కాదా అని నిలదీశారు. అభ్యుదయవాది మారోజు వీరన్నను చంపించిన నరరూప హంతకుడివి నువ్వేనని, ఆయన నిధులను కాజేయడానికి చంద్రబాబుతో కుమ్మక్కైన దొంగవు నువ్వేనని తీవ్ర ఆరోపణలు చేశారు. మేధావి ముసుగు వేసుకుని కవితపై విమర్శలు చేస్తే ప్రజలు నమ్మరని శ్రీకాంత్ గౌడ్ అన్నారు. తెలంగాణలో ఉప ఎన్నికలు వచ్చినప్పుడు సమైక్య పార్టీలకు అమ్ముడు పోయింది, దేవేందర్ గౌడ్‌తో నవ తెలంగాణ పార్టీ పెట్టించింది, కపిలవాయి దిలీప్‌తో తెలంగాణ విమోచన పార్టీని పెట్టించింది నువ్వేనని గుర్తు చేశారు. “నీకు కూడా బిడ్డ ఉంది కదా. వ్యక్తిగత విమర్శలు చేసే కుసంస్కృతి మా అధ్యక్షురాలు మాకు నేర్పలేదు” అని శ్రీకాంత్ గౌడ్ అన్నారు. ఇకపై ఇలాగే మాట్లాడితే ఏ చర్చలో అయినా సరే గుంజి చెప్పులతో కొడతామని హెచ్చరించారు. “తస్మాత్ జాగ్రత్త, ఖబడ్దార్ వి. ప్రకాష్” అని ఆయన అన్నారు. తెలంగాణ ప్రజలను క్వాంటమ్, అమ్ వే పేర్లతో మోసం చేసిన చరిత్ర వి. ప్రకాష్‌ది అని గుర్తు చేశారు. కవిత తన తోబుట్టువు అయిన రామన్న (కేటీఆర్)పై చేసిన ఆరోపణలపై నోరు మెదపకపోవడం బాధాకరమని, కవితక్కపై ఆరోపణలు వచ్చినప్పుడు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఆడబిడ్డపై మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకోకపోతే భౌతిక దాడులు తప్పవని శ్రీకాంత్ గౌడ్ తీవ్రంగా హెచ్చరించారు.

# ఉచిత వైద్య శిబిరం




**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే డాక్టర్లను సంప్రదించి వైద్యం పొందాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. సోమవారం రోజున డివిజన్‌లోని ఉర్సు శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాల ముందు ఎస్ఆర్ఆర్ తోట ప్రైమరీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మరుపల్ల రవి మాట్లాడుతూ వర్షాకాలంలో జలుబు, దగ్గు, జ్వరాలతో ప్రజలు బాధపడుతున్నారని, ఇలాంటి వైద్య శిబిరాలు వారికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. డివిజన్‌లో కొందరికి డెంగ్యూ వ్యాధి కూడా ప్రబలిందని, దీంతో వారు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అంటువ్యాధులను నివారించవచ్చని ఆయన సూచించారు. రోగ నిర్ధారణ అయిన వారికి కార్పొరేటర్ స్వయంగా మందులను పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో 95 మందికి ఓపీ సేవలు, 80 మందికి బీపీ పరీక్షలు, 80 మందికి షుగర్ పరీక్షలు, 20 మందికి మలేరియా పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిత, ఏఎన్ఎం మచ్చా అనిత, ఆశా వర్కర్లు సుధ, అనిత, ప్రభాకర్, కృష్ణవేణి, గజ్జి సాంబయ్య మరియు జవాన్ రమేష్ పాల్గొన్నారు.

# డూప్లికేట్ ఓట్ల తొలగింపుకు బీజేపీ వినతి



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని దుర్గంపేట గ్రామం, శాయంపేట మండలంలోని గంగిరేనీగూడెం గ్రామాలకు చెందిన కొందరు ఓటర్ల పేర్లు రెండు చోట్ల ఉన్నాయని, వాటిని వెంటనే తొలగించాలని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మండల శాఖ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బీజేపీ నాయకులు సోమవారం ఎంపీడీఓ కల్పనకి ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ ఎన్నికలలో పారదర్శకతను కాపాడటానికి డూప్లికేట్ ఓట్లను తక్షణమే తొలగించాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే విధంగా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి తప్పుల వల్ల ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతుందని, కాబట్టి అధికారులు దీనిపై వెంటనే దృష్టి సారించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్ కుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పొడాల మధుకర్, ప్రధాన కార్యదర్శి గండు ముఖేష్, యువ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల సుమంత్ తదితరులు పాల్గొన్నారు. తనిఖీ చేసి, తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

# మెగా ఆయుర్వేదిక్ కేంద్రం ప్రారంభం

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** నగరంలోని రెడ్డికాలనీలో ఆదివారం మెగా ఆయుర్వేదిక్ కేంద్రం ఘనంగా ప్రారంభమైంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO),ఉత్తరాఖండ్ ఆయుర్వేదిక్ డిపార్ట్‌మెంట్ నుంచి గుర్తింపు పొందిన ఐఎంసీ సంస్థ ఆధ్వర్యంలో ఈ కేంద్రం ప్రజలకు ఆయుర్వేద ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ సందర్భంగా, సంస్థ అధినేత, ప్రముఖ ఆయుర్వేద నిపుణులు, సైకాలజిస్ట్ తిరుపతి తాండ్ర మాట్లాడుతూ అందరికీ అందుబాటు ధరలలో ఆయుర్వేద చికిత్సలను అందించాలనే లక్ష్యంతో ఈ కేంద్రాన్ని వరంగల్ నగరంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. “అనారోగ్యాలను దూరం చేసి, అందరికీ ఆరోగ్యాన్ని పంచాలనే ధృఢ సంకల్పంతో ‘మేడిన్ ఇండియా’, ‘మేకిన్ ఇండియా’ స్ఫూర్తితో మా సంస్థ పనిచేస్తోంది” అని ఆయన ప్రకటించారు. ఈ కేంద్రంలో లభించే ఉత్పత్తులు కేవలం చికిత్సకే కాకుండా, సంపూర్ణ ఆరోగ్యం, రోగనిరోధక శక్తిని పెంచేందుకు కూడా ఉపయోగపడతాయని ఆయన వివరించారు. ఈ సందర్భంగా, తిరుపతి తాండ్ర ప్రజలందరినీ ఈ కేంద్రాన్ని సందర్శించి, అందుబాటులో ఉన్న సేవలను వినియోగించుకుని సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని ఆకాంక్షించారు.



ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఆరోగ్య సమస్యలకు ఆయుర్వేదం ఒక శాశ్వత పరిష్కారమని తిరుపతి తాండ్ర నొక్కి చెప్పారు. రసాయనాలు లేని, సహజసిద్ధమైన ఆయుర్వేద ఉత్పత్తుల ద్వారా ఎలాంటి దుష్ప్రభావాలు లేకుండా ఆరోగ్యంగా ఉండవచ్చని ఆయన అన్నారు. మానసిక, శారీరక ఆరోగ్యం కోసం ఆయుర్వేదం ఎంతగానో సహాయపడుతుందని ఆయన తెలిపారు. ఈ కేంద్రం కేవలం ఉత్పత్తుల విక్రయానికే పరిమితం కాకుండా, ప్రజలకు ఆరోగ్య సలహాలు, సంప్రదింపులు కూడా అందిస్తుందని పేర్కొన్నారు. ఈ కేంద్రం ప్రారంభోత్సవానికి స్థానికులు, వివిధ రంగాల ప్రముఖులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. నగర ప్రజలకు మెరుగైన ఆయుర్వేద సేవలు లభించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

# లంబాడీలపై దుష్ప్రచారాలు మానుకోవాలి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి:** లంబాడీలపై జరుగుతున్న దుష్ప్రచారాలను వెంటనే ఆపాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలుంటాయని ఎల్-జాక్ నాయకులు హెచ్చరించారు. రఘునాథపల్లి మండల కేంద్రంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో మండల నాయకులు గూగులోతు కొమురెల్లి నాయక్ ఆధ్వర్యంలో ఈ ప్రకటన చేశారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎల్-జాక్ జిల్లా కన్వీనర్ భిక్షపతి నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మాజీ ఎంపీ సోయం బాబురావు సుప్రీంకోర్టులో ఎస్టీ జాబితా నుంచి లంబాడీ(బంజారా) లను తొలగించాలని కేసు వేసిన నేపథ్యంలో సుప్రీంకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు ఇచ్చిందని గుర్తు చేశారు. బ్రిటిష్ పాలనలోనే 1871 క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్‌లో లంబాడీలను గిరిజనులుగా గుర్తించారని, ఆ తర్వాత నిజాం పాలనలో జరిగిన జనగణనలో కూడా వారు గిరిజన జాబితాలోనే ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడినప్పుడు మద్రాసు రాష్ట్రం నుండే లంబాడీల ఎస్టీ స్టేటస్‌ను కొనసాగించారని, భారత రాజ్యాంగంలోని 342వ ఆర్టికల్, 1976 భారత చట్టం 108 ద్వారా అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ గిరిజన జాబితాలో చేర్చడం జరిగిందని వివరించారు. దీనికి సంబంధించి తమ వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం కొంతమంది రాజకీయ లబ్ది కోసం సామాజిక మాధ్యమాలలో కుట్రపూరిత ప్రచారం చేస్తున్నారని, ఇటువంటి చర్యలు మానుకోకపోతే వారికి తగిన బుద్ధి చెబుతామని భిక్షపతి నాయక్ హెచ్చరించారు. ఈ విషయాలపై రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర, ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా, హైదరాబాద్ కేంద్రంగా లంబాడీల సింహగర్జన కార్యక్రమాలు చేపడతామని ప్రకటించారు. అంతేకాకుండా, మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలో అదాలత్ టాను నాయక్ విగ్రహం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు నిర్వహించే శాంతి ర్యాలీకి లంబాడీ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ కొర్ర రాజేందర్ నాయక్, మండల నాయకులు మూడు తిరుపతి నాయక్, కొర్ర శంకర్ నాయక్, సేవ్యా నాయక్, మల్లేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఎన్ఎం కుటుంబానికి ఆర్థిక సహాయం



**వరంగల్ వాయిస్, వరంగల్:** తీవ్ర అనారోగ్యంతో మరణించిన ఆర్బీఎస్‌కే ఉద్యోగిని, ఏఎన్ఎం గ్రేసమ్మ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. వరంగల్ జిల్లా డీఎంహెచ్ఓ కార్యాలయం ముందు జరిగిన కార్యక్రమంలో ఆర్బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్, ఫార్మసిస్ట్ అసోసియేషన్, ఏఎన్ఎం అసోసియేషన్, డీఈఐసీ సిబ్బంది కలిసి ఆమె కుటుంబానికి రూ.1,04,800 అందజేశారు. గ్రేసమ్మ వర్ధన్నపేట టీమ్-ఎలో ఏఎన్ఎంగా పనిచేసేవారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ, నేషనల్ హెల్త్ మిషన్ కింద పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఇన్సెంటివ్‌లు, రీయింబర్స్‌మెంట్లు, హెల్త్ ఇన్సూరెన్స్, కారుణ్య నియామకాలు వంటి సదుపాయాలు ఉండవని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే అసోసియేషన్ తరఫున తాము ఈ సహాయం అందించామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కాంట్రాక్ట్ ఉద్యోగులకు తగిన సదుపాయాలు కల్పించాలని వారు కోరారు. సహాయం అందించిన ప్రతి ఒక్కరికీ వరంగల్ జిల్లా ఆర్బీఎస్‌కే తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ డాక్టర్ గుండా రవీందర్, డాక్టర్ నాగేశ్వరరావు (మెడికల్ ఆఫీసర్, వర్ధన్నపేట టీమ్-బి), ఫార్మసిస్ట్ అసోసియేషన్ బాధ్యులు డి. స్వాతి, శివ, ఏఎన్ఎం ఆర్బీఎస్‌కే బాధ్యురాలు ఎండి. సమీనా తదితరులు పాల్గొన్నారు.

# సీతారామచంద్రస్వామి ఆలయానికి విరాళాలు



**వరంగల్ వాయిస్, గణపురం:** మండల కేంద్రంలోని శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి, నవగ్రహ ప్రతిష్ఠాపనకు భక్తులు ఆర్థిక విరాళాలు అందజేశారు. ఆదివారం చంద్రగ్రహణం అనంతరం సోమవారం ఆలయ అర్చకులు ముసునూరు నరేష్ సంప్రోక్షణ, ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్ మాట్లాడుతూ రానున్న కార్తీక మాసంలో ఆలయంలో గణపతి, నవగ్రహ, శివలింగ ప్రతిష్ఠాపన మహోత్సవం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో, తిప్పని అరుణాదేవి, కృష్ణమూర్తి దంపతులు గణపతి విగ్రహం కోసం రూ. 25,000 విరాళంగా అందజేశారు. అదేవిధంగా, వరంగల్‌కు చెందిన బానకారి ఊర్మిళ, రమేష్ చారి దంపతులు ఆలయ అభివృద్ధికి రూ. 10,000 విరాళం ఇచ్చారు. ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ అధ్యక్షులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బందారు శంకర్, మూల శ్రీనివాస్ గౌడ్, బటిక స్వామి, దైవాల భద్రయ్య, పాండవుల భద్రయ్య, బూర రాజగోపాల్, మాదాసు అర్జున్, మాదాసు మొగిలి, ఉయ్యాల భిక్షపతి తదితర భక్తులు పాల్గొన్నారు.

# లెనిన్ నగర్‌లో ఆర్ఓ వాటర్ ప్లాంట్ ప్రారంభం



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ సెంట్రల్ రోటరీ క్లబ్-3150 ఆర్థిక సహాయంతో రంగసాయిపేట 42వ డివిజన్‌లోని లెనిన్ నగర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఆర్.ఓ. వాటర్ ప్లాంట్‌ను సికింద్రాబాద్ పదవ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ డాక్టర్ కంచ ప్రసాద్ మరియు డాక్టర్ పి.డి.జి. శరత్ బాబు ప్రారంభించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ కంచ ప్రసాద్ మాట్లాడుతూ, సుమారు 600 కుటుంబాలు నివసించే ఈ స్లమ్ ప్రాంతంలో తాగునీటి అవసరాన్ని తీర్చడానికి రోటరీ క్లబ్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. రోటరీ క్లబ్ అనేక సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతోందని ప్రశంసించారు. అలాగే, 42వ డివిజన్‌లో మరణించిన వారి కోసం ఫ్రీజర్ బాక్స్ అందుబాటులో లేదని కమిటీ సభ్యులు చెప్పడంతో, తాను తన మిత్రులతో కలిసి ఒక ఫ్రీజర్‌ను అందిస్తానని హామీ ఇచ్చారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు మదూరి గణేష్ మాట్లాడుతూ, రోటరీ క్లబ్ తరఫున ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, అందులో భాగంగానే ఈ ప్రాంతంలో ఆర్.ఓ. వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. రోటేరియన్ డాక్టర్ చిలుకూరి శరత్ బాబు మాట్లాడుతూ, లెనిన్ నగర్ ప్రజల సౌకర్యార్థం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ మాట్లాడుతూ, లెనిన్ నగర్ అభివృద్ధి కమిటీ విజ్ఞప్తి మేరకు రోటరీ క్లబ్ వెంటనే స్పందించి వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే, ఫ్రీజర్ బాక్స్‌ను అందించడానికి హామీ ఇచ్చిన డాక్టర్ కంచ ప్రసాద్‌కి కూడా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రాజెక్ట్ చైర్మన్ బేతి అశోక్ బాబు, ఆర్‌టిఎన్ ఏ.జి. నరేష్, టీఎన్‌జీఓస్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్, కేఎంసీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, సబ్ రిజిస్ట్రార్ శివారపు సురేష్ బాబు, రోటరీ క్లబ్ కార్యదర్శి పొన్న హరినాథ్, కోశాధికారి బండారి కుమారస్వామి, కోరే చంద్రమౌళి, పోరండ్ల రత్నాకర్, చిన్నాల సత్యనారాయణ, ప్రసాద్, కిరణ్, వేణు, అనిల్, గోరంట్ల మనోహర్, చిప్ప వెంకటేశ్వర్లు, బుక్క సతీష్ కుమార్, లెనిన్ నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్ష కార్యదర్శులు చింతపట్ల కమలాకర్, గుంటి కుమార్, గౌరవ అధ్యక్షులు మాలోతు సాగర్, నాయకులు మోర రాకేష్, పూల రాజేందర్, భీమారం యాదగిరి, ఎండి. రఫీక్, పలకపాటి శ్రీనివాస్, మబ్బిగ తిరుమల్, సంజీవ, రాజేష్, రాజయ్య, శ్రీను, రాజు, అశోక్, హైమ, లావణ్య, రేణుక, రాధిక, శైలజ తదితరులు పాల్గొన్నారు.

# సంగెంలో ఎరుకల భాషకు గుర్తింపు

## గ్రామ పంచాయతీల్లో తీర్మానాలు



**వరంగల్ వాయిస్, సంగెం :** మండలంలోని గ్రామ పంచాయతీలన్నీ ఒక కీలక నిర్ణయం తీసుకున్నాయి. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల ఆవరణలో ఎరుకల భాషను అధికారికంగా గుర్తిస్తూ, ఆ భాష పదాలను తీర్మానించి ఆమోదించారు. ఈ చర్యను లంబాడీ భాషా లిపి రచయిత ధరవాత్ సాంబనాయక్ అభినందించారు. ఈ సందర్భంగా సాంబనాయక్ మాట్లాడుతూ ఎరుకల భాషను ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా భారతదేశంలోని అన్ని రాష్ట్రాల్లోని వివిధ గ్రామ పంచాయతీలలో తీర్మానించి ఆమోదించాలని కోరారు. భాషా సంరక్షణకు మరియు సాంస్కృతిక వారసత్వానికి ఈ చర్యలు ఎంతో దోహదపడతాయని ఆయన అన్నారు. ఈ నిర్ణయం ఎరుకల సమాజానికి ఎంతో గౌరవాన్ని, గుర్తింపును తీసుకొస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొలనుపాక భిక్షపతి, పులిచెరి రవళి, నాగరాజు, రాయపురం సమ్మయ్య, రమేష్, రాయపురం మల్లయ్య, అనిల్, రాజు తదితరులు పాల్గొన్నారు. తమ భాషకు అధికారిక గుర్తింపు లభించడం పట్ల ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

# దండు మౌళికకు ఎమ్మెల్యే నాగరాజు నివాళి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 2వ డివిజన్ పరిధిలోని విజయలక్ష్మీ కాలనీకి చెందిన అడ్వకేట్ దండు మోహన్ కుమార్తె దండు మౌళిక ఇటీవల మరణించగా, ఆమె దశదిన కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కె.ఆర్. నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు దండు మౌళిక చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మరియు మౌళిక కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# దమ్మన్నపేటలో చల్లా జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, దామెర:** పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి జన్మదిన వేడుకలు దామెర మండలంలో ఘనంగా జరిగాయి. మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు దుబాసి నవీన్ ఆధ్వర్యంలో కార్యకర్తలు ఈ వేడుకలను నిర్వహించారు. గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చన కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం, కేక్ కట్ చేసి ఒకరికొకరు స్వీట్లు పంచుకున్నారు. అనంతరం ప్రజలకు, కార్యకర్తలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి నియోజకవర్గానికి చేసిన సేవలను నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు భిక్షపతి, అనిల్, రఘుపతి రెడ్డి, రాజు, ప్రమోదు, రాజు, నాగరాజు, బాలయ్య, శ్రావణ్, తిరుపతి, మహిళలు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో..

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఆత్మకూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు పాపని రవీందర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేసి, 'చల్లా ధర్మారెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి', 'జై చల్లా, జై జై చల్లా' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వృద్ధులకు, పిల్లలకు స్వీట్లు, పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లేతకుల సంజీవరెడ్డి బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బొల్లోజు కుమారస్వామి, నాయకులు రేవూరి సుధాకర్ రెడ్డి, నత్తి సుధాకర్, అంద్రు విశ్వేశ్వర్ రెడ్డి, భగవాన్ రెడ్డి, రేవూరి ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

# పెరిక సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా నల్లపు కోటేశ్వర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** పెరిక సంక్షేమ సంఘం, హనుమకొండ శాఖకు నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. నయీమ్ నగర్‌లోని గీతాంజలి మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన 8వ ద్వివార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నికలు జరిగాయి. సభ్యుల ఏకగ్రీవ ఆమోదంతో నూతన అధ్యక్షుడిగా నల్లపు కోటేశ్వర్ ఎన్నికయ్యారు. అలాగే, ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్ల ఈశ్వర్ కుమార్, కోశాధికారిగా దొమ్మాటి భాస్కర్ ను ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశానికి హనుమకొండ జిల్లా పెరిక కుల సంఘం అధ్యక్షులు సోమిశెట్టి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు గజవెల్లి వేణుమాధవ్, ప్రధాన కార్యదర్శి రామినేని రాజేష్ కుమార్, కోశాధికారి బుద్దే గణేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కుల సంఘం నాయకులు ప్రొఫెసర్ వడ్డే రవీందర్, కీత విజయ్ కుమార్, సంఘని మల్లేశ్వర్, చింతం లక్ష్మీనారాయణ, బరుపటి సంపత్ కుమార్, బోళ్ల వీరప్రతాప్, చింతం ధనుంజయ, గుమ్మళ్ళ మల్లికార్జున్, బెడద అనిల్ కుమార్, బిళ్ళ సుదర్శన్, దొంగరి శ్రీనివాస్, శ్రీరామ్ వీరయ్య, తీర్థాల పురుషోత్తం, తీర్థాల వీరయ్య, ముడిద వెంకటేశ్వర్లు, ముడిద దామోదర్ తదితరులతో పాటు సుమారు వంద మంది సభ్యులు పాల్గొన్నారు.

# ఏకరూప దుస్తుల పంపిణీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** హనుమకొండ ప్రభుత్వ వృత్తి విద్య జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా ఏకరూప దుస్తులు (యూనిఫామ్స్) పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం రిటైర్డ్ ఒకేషనల్ జూనియర్ లెక్చరర్ మేకల పరుశరాములు జ్ఞాపకార్థం ఆయన కుమార్తె చింతనిప్పుల శశికాంత సౌజన్యంతో జరిగింది. కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సవ్వాసి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా ఇంటర్ విద్యాధికారి ఏ. గోపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తల్లిదండ్రులు లేని, దివ్యాంగులైన విద్యార్థులకు ఈ యూనిఫామ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల రిటైర్డ్ లెక్చరర్లు మేకల కృష్ణ, మేకల విష్ణుకాంత్, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆర్. ప్రవీణ్ కుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సేవ దైవ సేవతో సమానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి ఆధ్వర్యంలో హనుమకొండలోని స్పందన మానసిక దివ్యాంగుల, బధిరుల ఆశ్రమంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు స్పెషల్ భోజనం, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ అన్నదానం మహాదానం అని అన్నారు. కల్మషం ఎరుగని ఈ మానసిక దివ్యాంగుల పిల్లలకు వారి ఇష్టమైన కూరలు, స్వీట్లతో భోజనం పెట్టడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. వీరికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. మానవ సేవయే మాధవ సేవ అని గుర్తు చేస్తూ, దివ్యాంగుల పట్ల ప్రతి ఒక్కరూ ప్రేమతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పిల్లలు ఆటపాటలతో అందరినీ అలరించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో కే. రామ్ రెడ్డి, రంగా రెడ్డి, కృష్ణ, స్పందన ఆశ్రమం నిర్వాహకురాలు సుచరిత, హరిత, వసుధ, భార్గవి పాల్గొన్నారు.

# ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్‌ను అడ్డుకుంటున్న మంత్రి

■ డాక్టర్ జాడి రామరాజు నేత



**వరంగల్ వాయిస్, ఏటూరునాగారం:** ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్ ఏర్పాటును అడ్డుకోవడం ద్వారా ఏజెన్సీ ప్రాంతాన్ని ఎడారిగా మార్చాలని చూస్తున్నారని ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్ సాధన సమితి వ్యవస్థాపకులు డా. జాడి రామరాజు నేత ఆరోపించారు. సోమవారం కన్నాయిగూడెం మండలంలోని లక్ష్మీపురం గ్రామపంచాయతీ పరిధిలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ ఇచ్చి రెవెన్యూ డివిజన్ ప్రకటన చేయించారని, ఆ తర్వాత ఆదివాసీ, దళిత, బహుజన వర్గాల ప్రజలను నమ్మించడం కోసం పాలాభిషేకం చేయించుకుని రాక్షసానందం పొందారని ఆయన విమర్శించారు. అయితే, అధికారంలోకి వచ్చాక మంత్రి ఎందుకు ఆమోదం పొందకుండా అడ్డుకుంటున్నారో ఏజెన్సీ ప్రాంత ప్రజలకు, మేధావులకు, పత్రికా మిత్రులకు వివరించాలని ఆయన డిమాండ్ చేశారు. పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి పారుదల, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిని ఏటూరునాగారం, మంగపేట, తాడ్వాయి, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం మండలాలలోని కాంగ్రెస్ నాయకులు, పత్రికా మిత్రులు, ప్రజలు ఎక్కడికక్కడ నిలదీయాలని రామరాజు నేత కోరారు. అలాగే, ఈ ప్రాంత అభివృద్ధి కోసం నిర్వహిస్తున్న నిరాహార దీక్షకు మద్దతు పలకాలని విజ్ఞప్తి చేశారు. కాటారం రెవెన్యూ డివిజన్ ప్రకటన ఏటూరునాగారం కన్నా వారం రోజుల ముందే జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అది ఆమోదం పొంది పాలన ప్రారంభించినప్పటికీ మంత్రి శ్రీధర్ బాబుకు ఎలాంటి పాలాభిషేకం, అడ్వర్టైజింగ్ జరగలేదని ఆయన గుర్తు చేశారు. 2023 సెప్టెంబర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేసిన తర్వాతే అక్టోబర్ 7న ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్ ప్రకటన చేస్తూ జీఓ విడుదల చేశారని, అయితే ఆమోదం పొందకుండా అడ్డుకుంటున్న మంత్రిని ఈ ప్రాంత మేధావులు, మీడియా మిత్రులు, జర్నలిస్టులు, కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు స్వార్థ రాజకీయాలు పక్కన పెట్టి ప్రశ్నించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రెడ్డి సుమన్, అగ్గు వెంకటేష్, కుమ్మరి సత్యం, జనగాం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్య అందాలి

## ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, ఆత్మకూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) పెద్ది ఆంజనేయులు సోమవారం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో వసతులపై, విద్యార్థుల సమస్యలపై ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. స్టోర్ రూమ్, తరగతి గదులు, పాఠశాల పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో కూరగాయలు, ముఖ్యంగా సొరకాయలు నల్లగా ఉన్నాయని గుర్తించి, మంచి నాణ్యత గల సరుకులను సరఫరా చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పాఠశాలలో ఉన్న సమస్యలపై విద్యార్థులతో మాట్లాడగా, 592 మంది విద్యార్థులకు కేవలం 52 గదులు మాత్రమే అందుబాటులో ఉన్నందున ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీడీఓ ఆంజనేయులు హామీ ఇచ్చారు. ఈ తనిఖీలో ఆయన వెంట పేరెంట్స్ కమిటీ సభ్యులు మెకల రవి, సిలివేరు చిరంజీవి, ఎడ్ల భరత్ కుమార్, జన్నారం శంకర్, అలాగే కళాశాల ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పాఠశాలలో సమస్యలను త్వరగా పరిష్కరించాలని పేరెంట్స్ కమిటీ సభ్యులు కోరారు.



# క్షయ రోగులకు పోషకాహారం అవసరం

## డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** టీబీ వ్యాధిగ్రస్తులు చికిత్స సమయంలో మంచి పోషకాహారం తీసుకోవాలని, వారికి పోషకాహార కిట్లు అందించడానికి దాతలు ముందుకు రావాలని హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఎ. అప్పయ్య అన్నారు. 'టీబీ ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయంలో 'మనుస్ హెల్పింగ్ హ్యాండ్ ఫర్ ఆర్ఫన్ చిల్డ్రన్' సంస్థ సహకారంతో 20 నిక్షయ్ పోషణ కిట్లను ఆయన టీబీ రోగులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ క్షయ వ్యాధితో బాధపడేవారు క్రమం తప్పకుండా మందులు వేసుకోవడంతో పాటు, పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం ద్వారా వ్యాధి నుంచి త్వరగా కోలుకుంటారని తెలిపారు. ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. టీబీ రోగులకు మంచి పోషకాహార కిట్లు అందించడానికి దాతలు ముందుకు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డి.ఎం.హెచ్.ఓ. టి. మదన్ మోహన్ రావు, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ హిమబిందు, పి.ఓ.ఎం.హెచ్.ఎన్. డాక్టర్ మంజుల, మాస్ మీడియా అధికారి అశోక్ రెడ్డి, 'మనుస్ హెల్పింగ్ హ్యాండ్ ఫర్ ఆర్ఫన్ చిల్డ్రన్' సంస్థ ప్రతినిధులు మహేష్, నాగరాజు, జిల్లా టీబీ కోఆర్డినేటర్లు సుష్మ, నగేష్, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ విజయ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# రియాద్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

◆ తెలంగాణ బిడ్డలకు సత్కారం

**వరంగల్ వాయిస్, రియాద్ :** సౌదీ అరేబియాలోని రియాద్ నగరంలో సెప్టెంబర్ 5న తెలుగు భాషా దినోత్సవం, ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. సౌదీ అరేబియా తెలుగు అసోసియేషన్ (సాట) ఆధ్వర్యంలో సక్సెస్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాటా ఫౌండర్ మల్లేశ్, ముఖ్య అతిథులు సక్సెస్ ఇంటర్నేషనల్ స్కూల్ మాసూద్, రియాద్ అధ్యక్షులు శ్రీనివాస్ మచ్చ, వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ నూరుద్దీన్ (వరంగల్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహమ్మద్ నూరుద్దీన్ మాట్లాడుతూ, సౌదీ అరేబియాలో తెలుగు వారంతా కలిసి తెలుగు భాషా దినోత్సవం మరియు ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఈ వేడుకకు వివిధ ప్రాంతాల అధ్యక్షులైన యాంబు అధ్యక్షులు కాశీరాజు, జెడ్డా అధ్యక్షులు అంజాద్, ఈస్ట్రన్ రీజియన్ అధ్యక్షులు తేజ, టాసా ఫౌండర్ స్వామి హాజరై కార్యక్రమాన్ని మరింత విజయవంతం చేశారు. ఈ వేడుకలో రియాద్‌లో పది సంవత్సరాల కంటే ఎక్కువ కాలం విద్యా సేవలు అందించిన ఉపాధ్యాయులను గౌరవ సత్కారం చేసి, మెమెంటోలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో రియాద్ కోర్ టీమ్ సభ్యులు శర్వాణి విద్యాధరణి, కోకిల, ప్రీతి, లోకేష్, సింగ్ నరేష్, శహబాజ్ అహ్మద్, మహమ్మద్ అబ్దుల్ గఫార్, మిథున్ సురేష్, ముదిగొండ శంకర్, వీరవల్లి యోగేశ్వర రావు, మురళి కృష్ణ బూసి, నయీమ్, అయాజ్, ముజామిలుద్దీన్, ఇలియాస్, అస్లాం పాల్గొన్నారు.



WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
సోమవారం, సెప్టెంబర్ 08, 2025




# ఐక్యంగా కదులుదాం.. రాజకీయంగా ఎదుగుదాం..

- **ఘనంగా పద్మశాలి పరపతి సంఘాల సమావేశం**
- **హాజరైన సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారులు**
- **పండుగలు, సంస్కృతి వికాసం, కార్తీకమాస వనభోజనాలపై చర్చ**

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** పద్మశాలీలు అందరూ ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని, సంఘటితంతోనే కుల అభివృద్ధి సాధ్యమని కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ పిలుపునిచ్చారు. శక్తివంతమైన పద్మశాలి సమాజ నిర్మాణమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. హనుమకొండలోని కెఎల్ఎన్ రెడ్డి కాలనీలో శ్రీ భక్త మార్కండేయ సేవా సంఘం అధ్యక్షుడు వైద్యం రాజగోపాల్ అధ్యక్షతన నిర్వహించిన హనుమకొండ జిల్లా, పట్టణ పద్మశాలీ పరపతి సంఘాల ప్రత్యేక సమావేశానికి 30 సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు , కోశాధికారులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సమావేశం జై మార్కండేయ, జై పద్మశాలి నినాదాలతో హోరెత్తింది. భవిష్యత్ కార్యాచరణపై పలు తీర్మానాలను ఆమోదించారు. స్వర్గీయ కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సెప్టెంబర్ 27న 500 మంది సభ్యులతో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. కార్తీక మాస వన భోజనాల కార్యక్రమాన్ని నిర్వహించాలని తీర్మానించారు. మార్కండేయ జయంతి, జంజనపూర్ణిమ, ఇతర పండుగలను విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించారు. జిల్లా పాలన యంత్రాంగం నగరంలోని ప్రముఖ కూడలిలో స్థలం కేటాయించి, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని నెలకొల్పాలని తీర్మానించారు. ప్రతినెల 18వ తేదీన సమావేశమై పద్మశాలీలకు సంబంధించిన అన్ని కార్యక్రమాలను సమన్వయం చేసే బాధ్యతను వైద్యం రాజగోపాల్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని తయారు చేయించి ఇస్తానని కొత్తూరు పరపతి సంఘం అధ్యక్షుడు తౌటం విజేందర్ ప్రకటించారు. కార్తీక మాస వన భోజనాలకు ఫామ్ హౌస్‌ను ఏర్పాటు చేస్తామని రెడ్డి కాలనీ పరపతి సంఘం అధ్యక్షుడు బత్తుల రమేష్ బాబు తెలిపారు. అలాగే, కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఏర్పాటుకు రెవెన్యూ కాలనీ అధ్యక్షుడు చింతకింది రాజేశం ముందుకు వచ్చారు. విగ్రహం దాత ముందుకు వచ్చినందున, విగ్రహ స్థాపనకు స్థలం ఏర్పాట్లు చేయడంలో చొరవ చూపాలని, కలెక్టర్, మేయర్ తో మాట్లాడాలని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజ్ ను కోరారు.ఈ సందర్భంగా దాతలకు ధన్యవాదాలు తెలిపి, పొదుపు సంఘాల అధ్యక్షులకు మార్కండేయ ఫొటోను అతిథులు జ్ఞాపికగా అందజేశారు.

### పద్మశాలీల రాజకీయ ఎదుగుదలకు పిలుపు..

కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ మాట్లాడుతూ, భవిష్యత్తులో పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలని, అన్ని రంగాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, వరంగల్ వాయిస్ ఎడిటర్, సీనియర్ జర్నలిస్ట్ గడ్డం కేశవమూర్తి , తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, పద్మశాలీలు ఆర్థికంగా, అన్ని రంగాల్లో పరిణతి చెందినా, నవ సమాజ నిర్మాణం కోసం ముందుకు రావడం లేదని అన్నారు. పద్మశాలీల అభివృద్ధికి, రాజకీయ ఎదుగుదలకు ఐక్యంగా కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైందని వారు నొక్కి చెప్పారు. ఇకపై ఏ ఎన్నికలు వచ్చినా తమ సామాజిక వర్గం అభ్యర్థిని నిలబెడితే గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బొద్దున వెంకటేశ్వర్లు, రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు బత్తుల రమేష్ , టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు కోడం రవి ప్రకాష్ , జర్నలిస్టులు పులి కంటి రాజేందర్ , దాసరి ధనంజయతో పాటు జిల్లాలోని పరపతి సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు,కోశాధికారులు , పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరపతి సంఘాల నేతలు మాట్లాడుతూ హనుమకొండ జిల్లా పద్మశాలి కులస్తుల్లో కదలిక వచ్చిందన్నారు. ఇక నుంచి ప్రతి నెల క్రమం తప్పకుండా జిల్లాతో పాటు, నగరంలో ఉన్న పరపతి సంఘాల ముఖ్యులంతా కలుసుకొని తమ సమస్యలు పరిష్కరించుకోవాలని నిర్ణయించారు. రాష్ట్ర పద్మశాలి సంఘం ముఖ్య నాయకులు వైద్యం రాజగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అంతా ఒక్కటే... తమ సంఘీభావం తెలిపారు. ఈ సమావేశానికి హాజరై విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి రాజగోపాల్ కృతజ్ఞతలు తెలిపారు. అందరి వివరాలను కంప్యూటర్లో నిక్షిప్తం చేసి ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలియజేస్తానని ఆయన ప్రకటించారు.








# ప్రజల కోసమే జీవితం..

- త్యాగం చేసేది కమ్యూనిస్టులే
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- హనుమకొండలో ఘనంగా సురవరం సంస్మరణ సభ




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రజల కోసం జీవితాన్ని త్యాగం చేసేది కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్ లో సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంటు సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభను హనుమకొండ, వరంగల్ జిల్లా కార్యదర్శులు కర్రె భిక్షపతి, షేక్ బాష్ మియా అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ నిత్యం ప్రజా జీవితంలో ఉండే కమ్యూనిస్టులకు ఎలాంటి మచ్చ ఉండదన్నారు. నిస్వార్థ పరులైన సురవరం, సీతారాం ఏచూరి, గద్దర్ లాంటి వారు మరణించినప్పుడు ప్రజలు నీరాజనాలు పలికారన్నారు. త్యాగాలకు, పోరాటాలకు నిలయం కమ్యూనిస్టు పార్టీ అని, అందుకే వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్నా నేటికీ ప్రజల గుండెల్లో నిలిచి ఉందన్నారు. ఎన్నికలు ధన ప్రవాహంగా మారిపోయినా, మతోన్మాద శక్తులు ప్రజలను విభజిస్తున్నా వాటికి ఎదురొడ్డి సీపీఐ నిలబడిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగం నుంచి సెక్యులర్, సోషలిజం పదాలను తొలగిస్తూ ఈసీ, సీబీఐ లాంటి సంస్థలను తమ గుప్పెట్లో పెట్టుకుని ప్రశ్నించే వారిని అణిచివేసే చర్యలు చేపడుతున్నదని ఆరోపించారు.

అలాంటి వారికి ఎర్రజెండా అంటే భయమని, దేశంలో కమ్యూనిజాన్ని లేకుండా చేయాలనుకుంటున్నారన్నారు. దేశంలో కమ్యూనిష్టులందరూ ఏకం కావాలని, ఎర్రజెండాలన్నీ ఒకే జెండాగా మారాలని అందరూ కోరుకుంటున్నారని అన్నారు. ఎర్రజెండాను మరింత ఎరుపెక్కించడమే సురవరంకు నిజమైన నివాళి అని అన్నారు. రాష్ట్రంలో పార్టీ ఫిరాయింపులకు ఆజ్యం పోసింది బీఆర్ఎస్సేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఈ నెల 11 నుంచి 17 వరకు నిర్వహిస్తున్న తెలంగాణా సాయుధ పోరాట వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ కమ్యూనిస్టులు బడుగు, బలహీన వర్గాల కోసమే పోరాడుతారని, పేద ప్రజల పట్ల కమ్యూనిస్టులకు ఎంతో అంకితభావం ఉంటుందని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం, హక్కుల సాధనలో కమ్యూనిస్టులు ముందుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్ రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, సీనియర్ నాయకులు టి. వెంకట్రాములు, మేకల రవి, సిరబోయిన కరుణాకర్, ఆదరి శ్రీనివాస్, వలి ఉల్లా ఖాద్రి, టి.విశ్వేశ్వర్ రావు, మంద సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, సీపీఎం నాయకులు ఆరూరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 9న లంబాడీల శాంతి ర్యాలీ

- తరలి రావాలంటూ లంబాడి జాక్ పిలుపు
- లంబాడీలపై ప్రభుత్వం, ప్రతిపక్షాల వైఖరి స్పష్టం చేయాలని డిమాడ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** లంబాడీలపై ప్రభుత్వం, ప్రతిపక్షాల వైఖరి స్పష్టం చేయాలని లంబాడి జాయింట్ ఆక్షన్ కమిటీ (ఎల్–జేఏసీ) కన్వీనర్ జాటోత్ కిషన్ నాయక్ డిమాండ్ చేశారు. 9న నిర్వహించనున్న శాంతి ర్యాలీకి లంబాడీలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. హనుమకొండ గుండ్ల సింగారం బంజారా కాలనీలో సోమవారం ఎల్–జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాటోత్ కిషన్ నాయక్ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా ఎస్టీ జాబితాలో ఉన్న లంబాడీలను తొలగించాలంటూ రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడిచేలా కోయ గోండు నాయకులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాజకీయ లబ్ది కోసం దుష్ప్రచారం చేస్తూ లంబాడీలపై విశం కక్కుతున్నారన్నారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలంటూ సుప్రీం కోర్టులో కేసు వేశారన్నారు. శాంతి కాముకులైన లంబాడి బిడ్డలు ఏనాడు తమ విచక్షణను కోల్పోయి కోయా గోండు బిడ్డలపై అసహనం, ప్రభుత్వ వ్యతిరేక చర్యలకు పాల్పడలేదన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ లంబాడి జేఏసీ కన్వీనర్ జై సింగ్ రాథోడ్, వీఎన్ నాయక్, వాంకుడోత్ వీరన్న నాయక్, బానోత్ వసంత్ నాయక్, గుగులోత్ వీరమ్మ, గోపి సింగ్ నాయక్, దరంసోత్ అనసూయ, బానోత్ వెంకన్న నాయక్, సమ్మయ్య రాథోడ్, ధరంసోట్ జగ్రామ్ నాయక్, భూక్య శ్రావణ్ నాయక్, లకావత్ కరుణాకర్ నాయక్, సిద్దు నాయక్, అజ్మీర వెంకట్ నాయక్, సుధాకర్ నాయక్, గోపి సింగ్ నాయక్, ధరావత్ బాలు నాయక్, భూక్య సారయ్య నాయక్, బానోత్ ఈరియా నాయక్, బోడ లచ్చు శ్రీజ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ కేసులపై పోరాడుదాం

- పార్టీ శ్రేణులకు లీగల్ సెల్ అండగా ఉంటుంది
- బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** హైదరాబాదులోని తెలంగాణ భవన్ లో ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్, బీఆర్ఎస్ పార్టీ లీగల్ సెల్ హనుమకొండ వరంగల్ జిల్లా బాధ్యులతో సోమవారం కేటీఆర్ ప్రత్యేకంగా మాట్లాడారు. ఇటీవల బీఆర్ఎస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో యూరియా కోసం, కాళేశ్వరంపై కాంగ్రెస్ చేస్తున్న తప్పుడు ప్రచారాలపై, బీసీ 42 శాతం రిజర్వేషన్ల కోసం హనుమకొండ చౌరస్తాలో ధర్నా నిర్వహించిన నేపథ్యంలో పోలీసులు తప్పుడు కేసులు నమోదు చేశారని లీగల్ సెల్ బృందం ఈ సందర్భంగా కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. వారితో కేటీఆర్ మాట్లాడుతూ.. గులాబీ శ్రేణుల పక్షాన ఎల్లవేళలా బీఆర్ఎస్ పార్టీ లీగల్ సెల్ పోరాడుతుందన్నారు. అక్రమ కేసులకు భయపడబోమని, బీఆర్ఎస్ శ్రేణులకు ఉద్యమాలు కొత్తేమీ కాదన్నారు. ఎన్ని అక్రమ కేసులు బనాయించినా ప్రజల తరఫున పోరాడుతామని, వారి హక్కుల సాధన కోసం నినదిస్తామని పునరుద్ఘాటించారు. వినయ్ అన్నకు కేసులు, ఉద్యమాలు కొత్త కావని, ప్రతినిత్యం ప్రజల సమస్యలపై పోరాడుతున్నారని కొనియాడారు. బీఆర్ఎస్ హనుమకొండ, వరంగల్ జిల్లా లీగల్ సెల్ సైతం అద్భుతంగా పనిచేస్తుందని అన్నారు. కాగా లీగల్ సెల్ బాధ్యులు సీనియర్ న్యాయవాది తాళ్లపల్లి జనార్ధన్ గౌడ్, వినోద్ కుమార్ కేటీఆర్ ను కలిసిన వారిలో ఉన్నారు.

# నాపా సమావేశానికి రవీందర్ కు ఆహ్వానం



**అందిన ఆహ్వాన పత్రిక**

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నార్త్ అమెరికన్ పద్మశాలి అసోసియేషన్ (నాపా) ఆధ్వర్యంలో అమెరికాలోని వర్జీనియాలో జరుగు సదస్సుకు గౌరవ అతిథిగా హాజరయ్యేందుకు వరంగల్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఆడెపు రవీందర్ కు ఆహ్వానం అందింది. ఈనెల 20న జరుగు 12వ వార్షిక సదస్సుకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పద్మశాలి కమ్యూనిటీ సభ్యులు నాయకులు, ప్రముఖులు హాజరుకానున్నారు. ఈ సదస్సులో పద్మశాలి పురోగతి, ప్రపంచ సమాజాన్ని బలోపేతం చేయడంపై చర్చించనున్నారు. ఈ నేపథ్యంలో వరంగల్ జిల్లాలో పద్మశాలి సంఘం అభివృద్ధి కోసం చేపడుతున్న సేవలను గుర్తించి రవీందర్ ను ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నట్లు నార్త్ అమెరికన్ పద్మశాలి అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్ సాయిని, శ్రీ శ్రీ చెరుపల్లి ఒక ప్రకటనలో తెలిపారు.

# రాజీయే రాజ మార్గం

- 13న జాతీయ మెగాలోక్ అదాలత్
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**వరంగల్ వాయిస్, క్రైం :** ఈ నెల 13న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ పడదగిన కేసులలో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ మొదలగు కేసుల్లో కక్షిదారులు రాజీ పడే అవకాశం ఉంటుందన్నారు. రాజీయే రాజ మార్గమన్నారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దన్నారు. జుడిషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలోని పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ లు, ఇతర పోలీస్ సిబ్బంది రాజీకి అవకాశం ఉన్న కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి అవగాహన కల్పించాలన్నారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని పోలీస్ కమిషనర్ తెలిపారు.

# వినతులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- గ్రీవెన్స్ లో 136 ఫిర్యాదుల స్వీకరణ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ స్వయంగా వినతులు స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా శాఖల అధికారులకు అందజేశారు. నేటి ప్రజావాణి కార్యక్రమానికి 136 ఫిర్యాదులు రాగా, అధికంగా రెవెన్యూ 60 సమస్యలు, జీడబ్ల్యూఎంసీ 21, విద్యాశాఖ 11, తొమ్మిది సహకార శాఖ, ఏడు గృహ నిర్మాణ శాఖ, మూడు చొప్పు, వైద్య ఆరోగ్య శాఖ, ఉపాధి కల్పన శాఖలకు, ఇతర శాఖలకు సంబంధించిన 22 ఫిర్యాదులు వచ్చాయిని వెల్లడించారు. అర్జీదారుల దరఖాస్తులలో పేర్కొన్న సమస్యల పై క్షుణ్ణంగా పరిశీలించి, మానవతా దృక్పథంతో పరిష్కరించుటకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.చేపట్టిన చర్యలను వివరిస్తూ ఫిర్యాదుదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సంధ్యారాణి, డీఆర్ఓ విజయలక్ష్మి, జడ్పీ సీఈఓ రామిరెడ్డి, డీపీఓ అనురాధ, డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, హౌసింగ్ పీడీ గణపతి, డీసీఓ రాజమణి, ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, ఆర్సీవో అపర్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసిల్దార్లు, విభాగాల పర్యవేక్షకులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com